# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



## మోసం చేయడం కాంగ్రెస్ నైజం



ఖానాపూర్ రూరల్, నవంబర్ 28 : నాకు దిలావర్‌పూర్ మెయిన్ రోడ్డుకు ఆనుకొని రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. యేటా రెండు పంటలు తీస్తా. పూర్తిగా బావికి మోటరు పెట్టి నీరందిస్తా. కాంగ్రెస్ పాలనలో ఎవుసం అంటేనే భయమేసేది. ఒక్క పంట తీయడానికి తల్లడం మల్లడం అయ్యేది. కరెంటు ఎప్పుడొచ్చేదో.. ఎప్పుడు పోయేదో తెలియకుండే. రాత్రంగా చేల వద్దనే జాగారం చేసేది. తెల్లార్లు లో వోల్టేజీలో నిద్రపోకుండా పొలానికి నీరు పారించేది. గప్పుడే గన్ని కష్టాలు పడ్డం. గిప్పుడేమో మళ్లీ కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంటు అంటు వస్తున్నరు. 24 గంటల కరెంటు బీఆర్ఎస్ గవర్నమెంట్ ఇయ్యంగ, వీళ్లేమో మూడు గంటలంటున్నరు. రేవంత్‌రెడ్డి, ఉత్తంకుమార్‌రెడ్డి, భట్టి విక్రమార్కలకు సోయుండాలి. పెద్దపెద్ద వాళ్లే అవగాహన లేకుండా మాట్లాడుతుంటే.. వీళ్లు వచ్చేదుండా.. చచ్చేదుండా.. **- మెస గంగేశ్వర్, రైతు, అంబేద్కర్ నగర్, ఖానాపూర్**

## మోటర్లతో ఆర్థిక భారమే..



మామడ, నవంబర్ 28 : కాంగ్రెసోళ్లు చెప్పినట్లు 10 హెచ్‌పీ మోటర్లు వాడాలంటే వాటి ఖర్చు తడిసి మోపెడవుతది. మోటర్‌తోపాటు వైర్లు, పైపులు, స్టార్టర్ కూడా తీసుకోవాలి. వీటన్నింటిని కొనుగోలు చేయాలంటే లక్ష రూపాయలు అవుతాయి. ఇవన్నీ పైసలు ఎక్కడి నుంచి రావాలి. మళ్లీ అప్పు చేసి కొనన్నా. సీఎం కేసీఆర్ ఉచిత విద్యుత్ ఇస్తుంటే కాంగ్రెసోళ్లకు మింగుడు పడడం లేదు. ఉచిత కరెంట్‌పై లేనిపోని రాద్ధాంతాలు చేసి రైతులను వాళ్ల దిక్కు తిప్పుకోవాలని చూస్తున్నరు. అందుకే 10 హెచ్‌పీ మోటర్ల నాటకం ఆడుతుండ్రు. ప్రస్తుతం 3, 5 హెచ్‌పీ మోటర్లతో బోర్లు రోజంతా పోస్తున్నాయి. 10 హెచ్‌పీ మోటర్లు వాడితే ఉన్నది పోగొట్టుకోవాల్సిందే. కాంగ్రెసోళ్లు చెప్పే మాటలు వినేందుకు రైతులు సిద్ధంగా లేరు. రైతుల మేలుకోరే సీఎం కేసీఆర్ వెంటే ఉంటం. **- ఎంగన్న పోషన్న, పొన్కల్, మామడ మండలం.**

## నాడు కాంగ్రెస్‌కు రైతు గోస తగిలింది..



కడెం, నవంబర్ 28 : కాంగ్రెస్ హయాంలో కరెంటు సక్రమంగా లేకపోవడంతో పంటలు పండక, చేసిన అప్పులు తీర్చలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. బాధిత కుటుంబాలను ఆదుకునే నాథుడు లేకపోవడంతో చాలా కుటుంబాలు జీవచ్ఛవంగా బతుకుతున్నాయి. ఈ క్రమంలో కేసీఆర్ సర్కారు సాగుకు జీవం పోసింది. 24 గంటల కరెంటు ఇవ్వడంతో ప్రతి సెంటు భూమి సాగులోకి వచ్చింది. కొన్ని చోట్ల రెండు, మరికొన్ని చోట్ల మూడు పంటలు పండిస్తున్నారు. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మితే నట్టేట మునిగినట్టే. వారు వచ్చేది లేదు.. సచ్చేది లేదు. అన్ని గాలి మాటలే. **- భూక్యా శేఖర్, రైతు, కడెం.**

## 10 హెచ్‌పీ మోటర్లు వద్దు..



ఖానాపూర్, నవంబర్ 28 : వ్యవసాయం చేసే రైతులకే తెలుస్తది. సాగుకు ఎంత కరెంటు అవసరమో. పట్టణాల్లో కూర్చొని మాట్లాడె పెద్ద నాయకులకు ఏమి తెలస్తది సాగు గురించి. రేవంత్‌రెడ్డికి ఎవుసం ఉందా? ఉంటే మూడు గంటల కరెంటు సాలనడు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టాలని చెప్పడు. మూడు గంటలు ఇస్తమన్నరు సరే.. ఎప్పుడిస్తరో చెప్పలేదు. పగలిస్తరా, రాత్రిస్తరా అనేది క్లారిటీ లేదు. రాత్రిస్తే మళ్లీ సావు మరణమే అవుతది. నేను ఆరెకరాల్లో వరి వేసిన. మూడు గంటల కరెంటిస్తే ఎట్ల సరిపోతది. భూమి ఎక్కువున్న రైతు పరిస్థితి ఏమిటీ? అందరూ ఒకేసారి మోటర్లు ఆన్ చేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయ్. కాంగ్రెసోళ్లు అదే పరిస్థితి తీసుకొస్తే రైతుల బతుకులు ఆగమైతయ్. ఇప్పుడైతే రైతు బాంధవుడైన సీఎం కేసీఆర్ ఇచ్చే 24 గంటల కరెంటుతో పుష్కలంగా సాగవుతున్నాయి. ఈ పద్ధతి ఉంటే సరిపోతుంది. **- పడిగెల చంద్రయ్య, రైతు, పాత తర్లపాడు.**

## కాంగ్రెసొద్దు.. కరెంటొద్దు..



పెంబి, నవంబర్ 28 : ఇప్పుడున్న కరెంట్‌తో ఎవుసాన్ని పండుగ లెక్క చేసుకుంటున్నాం. నా నాలుగు ఎకరాల భూమిల రూపాయి కరెంట్ ఖర్చు లేకుండా రెండు పంటలు పండించుకుంటున్నం. కాంగ్రెస్ పాలనలో కరెంటు రాక, సాగు నీరు లేక పంటలు ఎండిపోయేవి. అచ్చిరాని కరెంటుతో ఎకరం భూమి కూడా పారక పోయేది. పూర్తిగా తడవాలంటే మూడు రోజులు పడుతది. ప్రస్తుతం ఇస్తున్న 24 గంటల కరెంట్‌తో ఆ బాధలన్నీ తీరినాయ్. నాకు వీలున్నప్పుడల్లా చేనుకు వెళ్లి చేలకు నీరు పెట్టుకుంటున్న. కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంట్ ఇస్తాం.10 హెచ్‌పీ మోటర్ పెట్టుకోవాలని అంటున్నడు. వారికి ఎవుసం గురించి ఏం తెలుసు. కాంగ్రెసొద్దు.. వాని కరెంటొద్దు. కాంగ్రెసోళ్లకు తగిన బుద్ధి చెబుతాం. సీఎం కేసీఆర్‌కే మద్దతిస్తాం. **- గుగ్లావత్ బలిరాంనాయక్, లోత్తోర్యతాండ, పెంబి మండలం.**

# కాంగ్రెస్ రావద్దు..
# ఎవుసం ఆగంగావద్దు..

- ఆ పార్టీని నమ్మే పరిస్థితి లేదు..
- మళ్లా మా బతుకులు నాశనం చేసుకోం..
- రాత్రుళ్లు పొలాలకు పోయే దుస్థితి మాకద్దు
- స్పష్టం చేస్తున్న అన్నదాతలు

**10 హెచ్‌పీ మోటర్ల** వల్ల భూమిల నీళ్లన్నీ ఒడుస్తయ్. కరెంట్ బాగా కాల్తది. రైతులకు ఫాయిదా ఉండది. గతంలో మాటిమాటికి బోరు మోటర్లు కాలిపోతుండే. ట్రాన్స్‌ఫార్మర్లు కరాబైతుండేటియి. ప్రతిసారి మోటరు తీయనీకి, దించనీకి మస్తు ఖర్సయ్యేది. పంటలు ఎండిపోయేటివి. తెలంగాణ అచ్చినంకనే కరెంట్ మంచిగిస్తున్నరు. పంటల మంచిగ పండుతున్నయ్. సర్కారు మా రైతులకు ఫ్రీగా కరెంట్ ఇయ్యవట్టే. గిప్పడే అన్నివిధాలా మా రైతులకు మంచిగ ఉన్నది. మళ్లా కాంగ్రెస్ నాయకులు 3గంటల కరెంట్, పది హెచ్‌పీ మోటర్లని మమ్మల్ని ఆగంజేస్తరేంది. కాలం మంచిగైతున్నది. కరెంట్ మంచిగుంటున్నది. మాకు రెండు పంటలు పండుతున్నయ్. రైతులకు, కైకిలోల్లకు కైకిలి దొరుకుతున్నది. గీ కాంగ్రెసోళ్లు అస్తే మళ్లా ఎన్కటి రోజులు తేవాలని జూత్తున్నరు. కాంగ్రెసోళ్లు రావద్దు. మా ఎవుసాన్ని మళ్లా ఆగం జేయద్దు.

## పైపులు పగులుతయ్..



లక్ష్మణచాంద, నవంబర్ 28 : టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి 10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకొని చేలకు నీరందించాలం టున్నడు. ఇప్పటికే భూమిలో నుంచి పైపులు వేసి చేలకు నీరు పెడుతున్నం. పది హెచ్‌పీ మోటరు ప్రెషర్ నీటితో పైపులు పగిలిపో తయ్. మరీ 10 హెచ్‌పీ మోటరు, పైపులు ఎవరు కొనిస్తరు. కాంగ్రెసోళ్ల మాటలు చూస్తే ఇల్లు పీకి పంది రేసుకొమ్మని చెప్పినట్లుంది. కాంగ్రెసోళ్లకు నాలుగోట్లు రాకున్నా.. రైతులను ఉద్ధరిస్తామని ఊకదంపుడు ఉపన్యాసాలిస్తున్నరు. మళ్లీ కేసీఆర్ గవర్నమెంటే రావడం ఖాయం. **- కొరిపెల్లి రవి, వడ్యాల్, లక్ష్మణచాంద మండలం.**

## గతం తలుచుకుంటే బాధేస్తది..



తానూర్, నవంబర్ 28 : కాంగ్రెస్ పాలనలో ఏడు గంటల కరెంటు ఇచ్చిన్రు. అది కూడా మూడు గంటలు పగలు, నాలుగు గంటలు రాత్రి ఇచ్చేటోళ్లు. రాత్రి పూట విద్యుత్ ఇస్తే అరిగోస పడుకుంటూ భయంగా పొలం వద్దకు పోయేటోళ్లం. పురుగు, పూసి కనిపించేవి. ఒక్కోసారి కాటేసిన సందర్భాలు కూడా ఉన్నా యి. కృరమృగాలు కూడా కనిపించేవి. వాటి భయానికి చెట్లు ఎక్కి దాక్కునేవాళ్లం. గటువంటి కరెంటిచ్చిన కాంగ్రెసోళ్ల మళ్లీ మూడు గంటల కరెంటు ఇస్తామని వస్తున్నరు. వారు ఇచ్చేది లేదు.. సచ్చేది లేదు. గతంలో పడ్డ బాధలు మళ్లీ పడడానికి సిద్ధంగా లేము. **- దార్మోడ్ వెంకటేశ్, రైతు, తానూర్ మండలం.**

## 10 హెచ్‌పీ పెడితే నీళ్లు పాతాళానికి పోతయ్..



మామడ, నవంబర్ 28 : గత కాంగ్రెస్ పాలనలో కరెంటు సక్రమంగా ఇవ్వకపోవడంతో ఒకే పంట పండించేవాళ్లం. ఇప్పుడు సీఎం కేసీఆర్ సార్ 24 గంటల కరెంట్ ఇస్తుండడంతో రెండు పంటలు పడిస్తున్నాం. టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్నట్లు సాగుకు మూడు గంటల కరెంట్ ఎట్లా సరిపోతది.10 హెచ్‌పీ మోటర్లు పెట్టుకోమంటున్నరు. 10 హెచ్‌పీ మోటర్లు పెడితే బోర్లు ఉంటయా. నీళ్లు పాతాళంలోకి వెళ్తాయి. పొలాలు పారేది ఎట్లా.. కాంగ్రెసోళ్ల మాటలు నమ్మశక్యంగా లేవు. వాళ్లకు అవకాశం ఇస్తే మరో పదేండ్లు వెనక్కి పోవాల్సి వస్తది. 24 గంటల కరెంటిచ్చే బీఆర్ఎస్ సర్కారుకు అండగా ఉందాం. **- మద్దెల శివన్న, బండల్ ఖానాపూర్, మామడ మండలం.**

## మూడు గంటలిస్తే మునుగుడే..



మామడ, నవంబర్ 28 : వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ ఇస్తే పొలాలకు నీళ్లు సరిపోక వ్యవసాయం చేయడం కష్టమవుతది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు సాగులో కరెంట్ కష్టాలు మళ్లీ మొదలవుతాయి. సీఎం కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల విద్యుత్‌ను అందిస్తుండడంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా వ్యవసాయాన్ని సాగు చేసుకోగలుగుతున్నాం. మా మద్దతు బీఆర్ఎస్‌కే.రైతుల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్‌యే మళ్లీ అధికారంలోకి రావాలి. **- దొంతుల దేవన్న, నల్దుర్తి, మామడ మండలం.**